**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల,వరంగల్,జగిత్యాల   శుక్రవారం 27 డిసెంబర్ 2024   పేజీలు :4 వేల : 2.00


## సీఎం రేవంత్‌రెడ్డితో భేటీకి హాజరైన సినీ ప్రముఖులు



**మన వార్త** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తో సినీ ప్రముఖులు భేటీ అయ్యారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సీఎంతో సమావేశమయ్యారు.సుమారు 50 మంది సినీ ప్రముఖులు అక్కడికి వచ్చారు.ఈ భేటీకి 21 మంది నిర్మాతలు, 13 మంది దర్శకులు, 11 మంది నటులు ఉన్నారు. నిర్మాతల్లో అల్లు అరవింద్, సురేశ్ బాబు, కె.ఎల్.నారాయణ, దామోదర్, బీవీఎస్ఎన్ ప్రసాద్, చినబాబు, దానయ్య, కిరణ్, రవి, స్రవంతి రవి కిషోర్, నాగబాబు, టీజీ విశ్వప్రసాద్, ప్రసన్న, యూవీ వంశీ, సుధాకర్ రెడ్డి, నాగవంశీ, సునీల్ - అనుపమ, గోపీ ఆచంట, సి.కల్యాణ్, రమేశ్ ప్రసాద్, భరత్ భూషణ్ ఉన్నారు.దర్శకుల్లో రాఘవేంద్రరావు, కొరటాల శివ, త్రివిక్రమ్, అనిల్ రావిపూడి, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్, వంశీ పైడిపల్లి, హరీశ్ శంకర్, వీర శంకర్, బాబీ, వేణు శ్రీరామ్, వేణు యెల్దండి, విజయేంద్రప్రసాద్‌తోపాటు నటులు నాగార్జున, వెంకటేశ్, వరుణ్ తేజ్, సాయిధరమ్ తేజ్, కల్యాణ్ రామ్, శివ బాలాజీ, అడివి శేష్, నితిన్, కిరణ్ అబ్బవరం, సిద్ధూ జొన్నలగడ్డ, రామ్ పోతినేని ఈ సమాశానికి హాజరయ్యారు.

## చెరువులో ఎస్సై మృతదేహం

## వెలికితీసిన రెస్క్యూ బృందాలు



ఎస్సై సాయికుమార్   కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్   కానిస్టేబుల్ శ్రుతి

**మన వార్త** కామారెడ్డి జిల్లాలో అదృశ్యమైన భిక్కనూరు ఎస్సై సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఆయన మృతదేహాన్ని రెస్క్యూ బృందాలు వెలికితీశాయి.బుధవారం రాత్రి అదే చెరువు నుంచి కానిస్టేబుల్ శ్రుతి, సహకార సంఘం ఆపరేపటర్ నిఖిల్ మృతదేహాలను బయటకు తీశారు.ఎస్సై సాయికుమార్‌తో పాటు బీబీపేట ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యమైన ఘటన కలకలం సృష్టించించిన విషయం తెలిసిందే. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు చెరువులో బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు చెరువులో లభ్యమయ్యాయి. జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో పోలీసులు.. ఎస్సై ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా గురువారం ఉదయం ఆయన మృతదేహం లభ్యమైంది.

## సిద్దిపేట జిల్లా కేంద్రంలో విషాదం

### బాలుడి ప్రాణం తీసిన గాలిపటం..



**మన వార్త** సిద్ధిపేట జిల్లా కేంద్రంలో విషాదం నెలకొంది. గాలిపటం ఓ బాలుడి ప్రాణం తీసింది. గాలిపటం ఎగరవేస్తూ చెరువులో పడి చనిపోయాడు.లెక్చరర్స్ కాలనీలో ఉండే తేజ (11) గాలిపటం ఎగరవేస్తుండగా ప్రమాదవశాత్తు గాలిపటం దారం తెగిపోయి.. సమీపంలో ఉన్న చెరువులో పడింది. దీంతో.. గాలిపటం కోసం వెళ్లిన ఆ బాలుడు మృత్యుఒడిలోకి వెళ్లిపోయాడు. గాలిపటం తెచ్చుకుందామని చెరువు దగ్గరికి వెళ్లిన బాలుడు.. గాలిపటం కోసం చెరువులోకి దిగాడు. దీంతో.. బాలుడికి ఈత రాకపోవడంతో తేజ గల్లంతయ్యాడు. అనంతరం.. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. చెరువు దగ్గరికి వెళ్లి పరిశీలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందించారు. దీంతో.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. స్థానికుల సహాయంతో బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు.

## ఇక ఉన్నది నెల రోజులే!

### ముగుస్తోన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీ కాలం




**మన వార్త** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీ కాలం మరో నెల రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ల టర్మ్ ముగియడంతో ఎలక్షన్స్ నిర్వహణకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నది.మరో నెల రోజుల్లో ఈ జాబితాలో పట్టణ స్థానిక సంస్థలు కూడా చేరే అవకాశమున్నది. అందుకోసం పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన రిజర్వేషన్లు, ఓటరు జాబితా, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, వార్డుల విభజన, మున్సిపాలిటీల్లో కొత్తగా విలీనమైన గ్రామాలను వార్డుల విభజించడం వంటి కార్యక్రమాలను పురపాలక శాఖ అధికారులు వేగవంతం చేశారు.గడువు జనవరి 26 వరకే.. రాష్ట్రంలో 143 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. వీటిలో 129 మున్సిపాలిటీలు, 14 కార్పొరేషన్లు ఉన్నాయి. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ 2024 ఫిబ్రవరిలో ఏర్పాటైంది. దీంతోపాటు మందమర్రి, మణుగూరు, పాల్వంచ, జహీరాబాద్ మున్సిపాలిటీలకు అనివార్యకారణాల వల్ల ఎన్నికలే నిర్వహించలేదు. 120 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం 26 జనవరి 2025న ముగియనుంది. ఒక్క కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ గడువు మాత్రమే 28 జనవరి 2025న ముగియనుంది. గ్రేటర్ వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లు, అచ్చంపేట, జడ్చర్ల, సిద్ధిపేట, కొత్తూరు, నకిరకల్ మున్సిపాలిటీలకు సంబంధించిన గడువు 05 మే 2026న ముగియనుంది. అంటే మరో ఏడాది పాటు పాలకవర్గాలకు వెసులుబాటు ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మాత్రం 2026లో ఫిబ్రవరి పదో తేదీ వరకు పదవీకాలం ఉంది.రిజర్వేషన్లు, వార్డుల విభజన పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ల తర్వాత మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికలకు ముందుగానే కొత్త మున్సిపాలిటీలు, ఆయా మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో వార్డుల విభజన చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతోపాటు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను ప్రభుత్వం నుంచి బీసీ కమిషన్ కు ఇవ్వనున్నారు. బీసీ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశముందని సచివాలయ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటే ఓటరు జాబితాను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## యాదగిరిగుట్ట కు వరుస సెలవులతో

### భారీగా తరలివచ్చిన భక్తులు




**మన వార్త** హైదరాబాద్ సహా పలు ప్రాంతాల నుంచి యాదగిరిగుట్ట కు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యాత్రీకులు భారీ సంఖ్యలో సొంత వాహనాల్లో రావడంతో పార్కింగ్ ప్లేస్ పూర్తిగా నిండిపోయింది. దీంతో వెహికల్స్‌ను వాహన పూజల ప్రాంగణానికి తరలించగా అది కూడా నిండిపోవడంతో వైకుంఠ ద్వారం నుంచి పార్కింగ్ ప్లేస్ సర్కిల్ వరకు రోడ్డుకు ఎడమ వైపున కిలోమీటర్ల మేర తాత్కాలికంగా పార్కింగ్ చేశారు. లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, బస్ బే, క్యూకాంప్లెక్స్, దర్శన, ప్రసాద క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి 4 గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటన్నర టైం పట్టిందని భక్తులు తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో బుధవారం ఒక్కరోజే ఆలయానికి రూ. 65,39,905 ఆదాయం వచ్చింది. ఇందులో అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.21,17,780, వీఐపీ దర్శనాలతో రూ.16.20 లక్షలు, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.7,50,600, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.8 లక్షలు వచ్చినట్లు ఆఫీసర్లు తెలిపారు. మరో వైపు ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు బుధవారంతో పదో రోజుకు చేరుకున్నాయి.


మన వార్త
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


## ఈఉత్తరము ముగించేముందు ఒక్కమాట

ఈరోజులో ఇవే చివరగంటలు
కాసేపటిలో రోజు ముగిసిపోతుంది
ఈకాస్తా సమయములో నీకొక లేఖరాయాలి
నువ్వుచదివే ప్రతి అక్షరములో
నీ ప్రతిబింబము ప్రస్ఫూటించాలి
ప్రతిపదములో నాలిపి స్పష్టంగా తెలియాలి
ఈఉత్తరము నేను ముద్రించినదని
అది నీకోసమని
నీలో ఎక్కడైనా నేనుగుర్తుంటే
ఆగుర్తులు ఈక్షేణము నీగుండెను పెకలించాలి...
ఎప్పుడో చాలా రోజులముందు చూశాను
ఇప్పుడు చాలా ఆకర్షణియంగా
అన్ని అమరినట్టు
తరగలపై నురగల తేలిపోతున్నావు
కాని,నీకు తెలిసినా గాయమేదో
నీ ముఖముపై
నాకళ్లు చూడగలుగుతున్నాయి
అదే ఇంతకుంకుమ
నీకనుబొమల మధ్య సూర్యునిలా వెలుగుతలేదు...
నీలో జీవమున్నట్టు అడుగులు ముందుకువెళుతున్నా
నీఆలోచన ఎక్కడో పరిభ్రమిస్తుంది
అది గతముమిగిల్చినా చేదుకావచ్చు
లేదా.....రేపటి ఒంటరితనము కావచ్చు
లేదా.....ఒంటిమీదా పేరుకుంటున్నా బలహీనతలా
చెమటకావచ్చు...
అందుకే....
ఈఉత్తరము చదువుతున్నప్పుడు
నీకళ్లు చెమ్మగిల్లకూడదు
రహదారిలో శిదిలాలుగా వదిలేసినా
గ్యాపకాలు గుర్తు చేసుకోకూడదు
లేఖాలోని ప్రతిఅక్షరము
నీభావాలను నొక్కిపట్టకూడదు
నీపాపిటిలో కుంకుమ లేనంతమాత్రానా
నీరాజనాలు అందుకొని లేతవయసు
కట్టుబాట్ల గొలుసులతో బందించకూడదు
ఋతువుమారితే
మోడు చిగురిస్తుంది
గాలితగిలితే మొగిలి పరిమళిస్తుంది
నిన్నునీవు పురమయించుకుంటే అదే కుంకుమ
నీముఖముపై ఎర్రని ప్రభాతమౌతుంది....
ఈఉత్తరము నిన్ను మేలుకొల్పుతుంది
ఎండకాలములో కూడ మేఘములో తడిఉన్నట్టు
నీలోనివిరక్తి తడిగామారి
తనువు ఉహల తరగలతో ఉరికే గోదారికావాలి
ప్రతిరోజు నుదుటిఆసనముపై ఆసినామయ్యే కుంకుమ
నిన్ను సౌందర్యలహరిని చేయాలి
జీవితములోంచి ఒకరువెళ్ళనా
మరొకరు రావడానికి గుమ్మముముందు శుద్ధిచేయాలి
మన ప్రయాణం ముగిసేవరకు
వెనుతిరిగి చూడకూడదు
సంకెళ్ళ,సమాజము పాతమాటలు
అభ్యుదయం పోరాటం నడిచేబాటలు
ఈఉత్తరము ముగించేముందు ఒక్కమాట
అది నువ్వు నడవడానికి పసుపుతో కట్టినదారి
నీనుదుటిపైకి కుంకుమతేవడానికి పట్టాలపైఎక్కించే
ప్రయత్నమే ఈఉత్తరములోని సారాంశము....



**కవి**

....... మారుపాక కృష్ణ (త్రిపుర సుందరి)

# కనీస జ్ఞానం లేని అమిత్ షా రాజీనామా చెయ్యాలి



**జహీరాబాద్, డిసెంబర్ 26 (మన వార్తా):** కనీస జ్ఞానం లేని అమిత్ షా కేంద్ర హోం మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ ఎ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో చంద్రశేఖర్ పేర్కొన్నారు. దేశంలో సగానికి పైన ఉన్న స్త్రీలకు రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ అని, ఆయన చేసిన మానవ సేవలను, తన మేధో శక్తిని ప్రపంచం కొనియాడుతున్న తరుణంలో అమిత్ షా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పైనే ప్రమాణం చేసి మొది ప్రధాని అయ్యారని, అదే రాజ్యాంగం పై ప్రమాణం చేసి అమిత్ షా హోం మంత్రి అయిన విషయం మరిచి పోవడం విచారకరం అన్నారు.

## అమిత్ షా పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని పిర్యాదు



**జహీరాబాద్, డిసెంబర్ 26 (మన వార్తా):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును కించ పరుస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ కాశీనాథ్ కు బహుజన సంఘాల నాయకులు సంయుక్తంగా పిర్యాదు చేశారు. భారత దేశ పార్లమెంటు సమావేశాల సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ అంబేద్కర్ అంబేద్కర్ అనే బదులు దేవుని పేరును స్మరిస్తే ఏడు జన్మల స్వర్గ ప్రాప్తి కలుగుతుందని అన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ను తక్కువ చేసి మాట్లాడడం వలన, బాబా సాహెబ్ అంబేద్కర్ ను, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ జీవనం కొనసాగిస్తున్న దేశ ప్రజల మనోభావాలు తిన్నాయని, మహిళలకు, పీడిత బహుజన ప్రజలకు రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించిన డాక్టర్ అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అమిత్ షా పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కి ఫిర్యాదు చేసిన వారిలో అంబేద్కర్ అనుబంధ అభిమాన సంఘాలు, టిప్పుసుల్తాన్, దళిత బహుజన, మైనార్టీ సంఘాలు, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నాయకులు ఉన్నారు.

## సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన సిపిఐ నాయకులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 26 (మన వార్త ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్, తెలంగాణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా పిలుపు మేరకు సిపిఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాల ఉత్సవాలను సుజాతనగర్ మండల కేంద్రంలో సిపిఐ జిందాబాద్ అంటూ నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు.

## ఏసుక్రీస్తు రాకతో మానవ జాతికి ఆశీర్వాదాలు



**-పాస్టర్ క్రాంతి వర్మ....**

**జహీరాబాద్, డిసెంబర్ 26 (మన వార్తా):** ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని చర్చీలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఝరాసంగం మండలం కుప్పానగర్ గ్రామం మరనాత విశ్వాస సమాజం మందిర ఆవరణలో పాస్టర్ క్రాంతి వర్మ, సంఘస్తుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రాంతి వర్మ మాట్లాడుతూ..! ఇది కేవలం క్రైస్తవుల పండుగ కాదని, గ్లోబల్ ఫెస్టివల్ భూగ్రహం మీద ఉన్న మానవజాతి మొత్తానికి పండగ అన్నారు. బానిసత్వాన్ని వ్యతిరేకించి మానవులంతా సమానమే నని క్రీస్తు నిరూపించారన్నారు. ఏసుక్రీస్తు మానవ జాతి సంక్షేమం కొరకు వచ్చాడని క్రిస్మస్ అనే పదం క్రిస్టోస్ మాస్ అని రెండు పదాల కలయికని, క్రీస్తు అనే పదానికి రక్షకుడు, మాస్ అనే పదానికి పూజించడం అనే అర్థంతో ఉన్న పదాలని ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. ఆయన రాకతో మనిషికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, మానవజాతి పొందుకున్న ఆశీర్వాదం క్రీస్తు రక్షణ లోనిదే అన్నారు. ఏసుక్రీస్తు రాకతో ప్రపంచ చరిత్రను రెండు భాగాలుగా విభజించి క్రీస్తు శకము, క్రీస్తు పూర్వం అనే పదాల ద్వారా ఒక ప్రత్యేక తేదీని లిఖించ బడడానికి పునాది ఏర్పడిందన్నారు. ఆయన రాకతో మనిషికి వ్యక్తిగత గుర్తింపు, మానవ జాతికి సమాన విలువను తీసుకొచ్చాడని, ఏసుక్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి ఒకరి కొకరు తినిపించుకున్నారు. వేడుకల్లో మహిళల కోలాటం, చిన్న పిల్లల నాటకాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ క్రిస్మస్ వేడుకల్లో చర్చ్ లే లీడర్ అలిగే రాములు, సంఘ పెద్దలు కొనదొడ్డి సంగన్న, మ్యాతరి రామయ్య, అశోక్, బుర్రి సంగప్ప, అలిగే అంద్రయ్య, మ్యాతరి శామయ్య, పాపయ్యా, మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ రవి, సంఘ సభ్యులు బాలరాజ్, మొగులన్న, నర్సిములు, యోహాను, విశ్వాసులు పాల్గొన్నారు.

## కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యల పై భగ్గుమన్న అంబేద్కర్ వాదులు




**-అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని భారీ నిరసన ర్యాలీ..**

**జహీరాబాద్, డిసెంబర్ 26 (మన వార్తా):** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై అంబేద్కర్ అభిమాన సంఘాలు భగ్గుమన్నాయి. పార్లమెంటులో అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవన్ నుండి డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ రహదారి 65 పై భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణ చెప్పాలని, హోం మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని అంబేద్కర్ చిత్ర పటాలను ప్రదర్శిస్తూ నినదించారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హోం మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేస్తూ అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాల మాహానాడు, అంబేద్కర్ యువజన సంఘం, బుద్ధిస్ట్ సొసైటి ఆఫ్ ఇండియా, అంబేద్కర్ స్టడీ సర్కిల్, అంబేద్కర్ కో ఆపరేటివ్ సొసైటి, టిప్పు సుల్తాన్, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీ నాయకులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు పాల్గొని అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు.

# రాష్ట్ర సర్కార్ ప్రజా సంక్షేమ పాలనలో విఫలం ఏర్పుల వెంకటరమణ



**గజ్వేల్ డిసెంబర్ 26(మన వార్త ప్రతినిధి జీ మురళి)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలనలో విఫలం అయింది అని బిజెపి సీనియర్ నాయకుడు ఏర్పుల వెంకటరమణ అన్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు ఏర్పుల వెంకటరమణ మాట్లాడుతూ సంవత్సరం పూర్తి చేసుకున్న రేవంత్ సర్కార్ ఎన్నికల లో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ప్రజా సంక్షేమ పాలన పక్కనపెట్టి, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఇటీవల అసెంబ్లీలో సినీ నటుడు అల్లు అర్జున్ పై సుదీర్ఘమైన చర్చ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, గురుకులాల్లో చనిపోతున్న విద్యార్థులు గుర్తుకు రావడం లేదా అని అన్నారు , ప్రజల సమస్యలపై పోరాడకుండా ప్రజల దృష్టి మరల్చే కార్యక్రమం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్వహిస్తుందని అన్నారు, భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో భారతదేశం పురోగమిస్తుందని తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన బిజెపి పార్టీ సభ్యత్వాలకు మంచి స్పందన వచ్చిందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జయకేతనం ఎగురవేస్తుందని, తెలంగాణలో బిజెపి బలపడుతుందని అన్నారు.

## సిఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన గాలిపల్లి విద్యార్థిని



**ఇల్లంతకుంట డిసెంబర్: 26 ( మన వార్త ప్రతినిధి బొంగోని రాజు )**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జెట్టి కీర్తన,ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం కప్ గర్ల్స్ కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 27 నుండి 30 వ, తేదీ వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటున్న కీర్తనను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని,మండల ( ఎస్జిఎఫ్ ) కన్వీనర్ సిహెచ్.సంపత్ రావు అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ బట్టు పద్మ-శ్రీనివాస్,ఉపాధ్యాయ బృందం,గ్రామస్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## షాద్ నగర్ లో జరిగే లంబాడిల మహా గర్జన కు తరలిరావాలి



**ఎల్ హెచ్ పి యస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందర్ నాయక్ పిలుపు..**

లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో లంబాడీలు మాట్లాడే భాష గోర్ బోలి ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న షాద్ నగర్ పట్టణంలోని సాయి రాజ ఫంక్షన్ హాల్ లో లంబాడీల మహా గర్జన నిర్వహిస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్ నాయక్ తెలిపారు.నెల రోజులపాటు షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్, కొత్తూర్,నందిగామ,కేశంపేట్, కొందుర్గు,జిల్లేడు చౌదరి గూడెం మండలాలతోపాటు షాద్ నగర్ టౌన్ ఎల్ హెచ్ పి ఎస్ నూతన కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు అన్నారు. రాబోవు రోజుల్లో అన్ని తాండాల కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. అన్ని మండలాలలో గల తాండాలలో లంబాడీలు మాట్లాడే భాష గోర్ బోలి ఆవశ్యకత గురించి ప్రచారం చేయడం జరిగిందని అన్నారు. గోర్ బోలితో పాటు తాండాలకు కావలసిన మౌలిక వసతుల సాధన గురించి లంబాడీలకు ప్రచారం చేయడం జరిగిందని వారు అన్నారు. తాండాలలో ఉన్న యువకులు విద్యా,ఉద్యోగ రాజకీయ రంగాలలో ముందుండాలని వారికి అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. లంబాడీల గర్జనకు ముఖ్య అతిథులుగా లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు,తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్,రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్ లతో పాటు జాతీయ,రాష్ట్ర జిల్లాల నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.కావున అన్ని మండలాల లంబాడి విద్యావేత్తలు,యువకులు మహిళలు,విద్యార్థులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చందర్ నాయక్ కోరారు.

## సిపిఐ శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లా కేంద్రం కొత్తగూడెం లో ఎర్రజెండాలతో కార్యకర్తలు భారీ ర్యాలీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 26( మన వార్త ప్రతినిధి జక్కల సంపత్ కుమార్)**

సిపిఐ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రం కొత్తగూడెం లో ఎర్రజెండాల తో కార్యకర్తలు భారీ కవాతు నిర్వహించారు. పట్టణం లోని పాత బాస్ డిపో ఏరియా నుండి ఎంజీ రోడ్, బస్టాండ్ సెంటర్ మీదుగా పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీ లో మహిళలు, యువకులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.ర్యాలీ నీ ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ దేశం లో కమ్యూనిస్టు ఉద్యమానికి 100 ఏళ్ల చరిత్ర తో ముందుకు సాగటం గర్వకారణం అన్నారు. కొత్తగూడెం గడ్డ పై అనేక మంది మహనీయుల త్యాగాలతో కమ్యూనిస్టు పునాది ఏర్పడి నేడు బలపడటం జరిగిందన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 10 వేల మంది పాల్గొంటున్నారని తెలిపారు. సిపిఐ ద్వారా అన్ని వర్గాల ప్రజల పక్షాన పోరాటాల చరిత్ర ఉన్నదన్నారు.

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం...



**-నీతి అయోగ్ క్రింద 500 మండలాల ఎంపిక..**

**.-తెలంగాణ రాష్ట్రంలో మూడు జిల్లాల్లో 10 మండలాల ఎంపిక..**

**-కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**మన వార్త .డిసెంబర్ 26:**దేశంలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరచడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు గురువారం నారాయణపేట జిల్లా నర్వ మండలం రాయికోడు గ్రామాన్ని కేంద్రమంత్రి తో పాటు ఎంపీ డీకే అరుణ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా జరుగుతున్న వివిధ సంక్షేమ పథకాలను తనిఖీ చేశారు నీతి అయోగ్ అస్పిరేషనల్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అభియాన్ కింద అత్యంత వెనుకబడిన ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2018 లో 112 జిల్లాలను గుర్తించగా తెలంగాణ రాష్ట్రంలో మూడు జిల్లాలలో పది మండలాలను గుర్తించడం జరిగిందన్నారు కేంద్ర ప్రభుత్వం పథకాల తో అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ అభియాన్ కింద నర్వ మండలం ఎంపిక కావడం జరిగింది ఇందులో భాగంగా రాయికోడు గ్రామంలో 6 విభాగాల్లో మూడు నెలల పాటు వివిధ కార్యక్రమాలను అమలు చేయడం వాటి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయని పరిశీలించడం జరిగింది అన్నారు ముఖ్యంగా అంగన్వాడి కేంద్రం గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టిక ఆహారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజన వసతి గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్యం వ్యవసాయం తాగునీరు తదితర వాటిపై కేంద్రమంత్రి పరిశీలించారు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు గ్రామస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయా లేదా అని కేంద్ర మంత్రులు పర్యటించి అక్కడ వచ్చిన ఫలితాల ద్వారా ఇంకా పేదరికంలో ఉన్న ప్రాంతాలను అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు నీతి అయోగ్ ద్వారా గుర్తించిన ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎలా ఉంది రాబోయే రోజుల్లో ఇంకా ఈ కార్యక్రమాన్ని విస్తృత పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందన్నారు అభివృద్ధి చెందిన ప్రాంతాలకు దీటుగా నీతి అయోగ్ ద్వారా ఎంపికైన ప్రాంతాలను కూడా అభివృద్ధి పరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు కేంద్ర మంత్రి వెంట అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ ట్రైన్ కలెక్టర్. గరిమా డిఎస్పి లింగయ్య జిల్లా శాఖల అధికారులు మండల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిజాయితీగా వ్యాపారం చేయండి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్. డిసెంబర్ 26. మన వార్త ప్రతినిధి.**

నాణ్యత తో కూడిన ప్రొడక్ట్ తయారు చేయడంతో పాటు నిజాయితీగా వ్యాపారం చేయండి అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు .మహబూబ్ నగర్ పట్టణం లోని, పిల్లల మర్రి రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మాడ్రెన్ ఐస్ ఫాక్టరీ ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఐస్ ఫాక్టరీ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ని వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్,బెక్కెరి మధుసూదన్ రెడ్డి మహ్మద్ ఇమ్రాన్, నసీబ్ ఖాన్, తఖి, మోయిజ్, శ్రీనివాస్ యాదవ్,ఇదిరీస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ కృష్ణయ్య ను సన్మానించిన బీసీ జేఏసీ నాయకులు..



**కరీంనగర్,డిసెంబర్26( మన వార్త ప్రతినిధి):** ఆర్ కృష్ణయ్య ను బీసీ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.బీసీల ఉద్యమకారుడు జాతీయ హెూదా కలిగిన ఆర్ కృష్ణయ్య ఏకగ్రీవంగా రాజ్యసభ హెూదా తో మొదటిసారిగా హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా కెశిపెద్ది శ్రీధర్ రాజు , రాచమల్ల రాజిరెడ్డి, దొగ్గలి శ్రీధర్ లు గురువారం ఆర్ కృష్ణయ్య ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల మొక్కను అందించారు. అనంతరం వారితో బిసి కుల గణన, మహిళలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ , రిజర్వేషన్లపై చర్చించి రాజ్యసభలో ఆమోదం అయ్యేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు.

## వంగవీటి మోహనరంగా వర్ధంతి నివాళులు...



**-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్పల్లి 26( మన వార్తా ప్రతినిధి)**

కి.శే. వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు , శిరీష్ బాబురావు , నియోజక వర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా రంగమోహన్, కూకట్ పల్లి కాపు సంఘము అధ్యక్షుడు యం. భరత్ కుమార్ , పులి మురళి, రాంబాబు నాయుడు, వలనాయుడు, బాలాజీ, నాగేశ్వరావు, పాపారావు , పున్నారావు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న జూదరుల అరెస్టు



**గంభీరావుపేట డిసెంబర్ 26 మన వార్త ప్రతినిధి**

ముస్తఫానగర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారు అన్న నమ్మదగిన సమాచారం మేరకు గంబీరావుపేట ఎస్సై తన సిబ్బందితో ముస్తఫా నగర్ లోని బట్టల చెరువు ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడి చేయగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 8850 నగదు నాలుగు చరవానులు మూడు బైకులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోపేకాట ఆడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడునని ఎస్ఐ హెచ్చరించారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి శోభాయాత్ర...



**శంకరపట్నం:డిసెంబర్ 26(మనవార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**

శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం అయ్యప్ప స్వామి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ముందుగా కొత్తగట్టు గ్రామంలో శ్రీ మత్స్య గిరింద్ర స్వామి దేవస్థానం నుండి ప్రధాన రహదారి మీదుగా కేశవపట్నంలోని అయ్యప్ప దేవాలయం వరకు శోభాయాత్ర జరిగింది. అయ్యప్ప స్వాముల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

## పంట రక్షణకు అక్రమ విద్యుత్ కనెక్షన్ వైర్లను తొలగింపు



**శాయంపేట మనవార్త (డిసెంబర్ 26)** రైతులు తాము పండించిన పంటలను అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి పంట చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి, 11 కెవి విద్యుత్ వైర్ల నుండి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, ఇది ప్రమాదకరమని కనెక్షన్ ఇవ్వవద్దని ఎన్పీడీసీఎల్ ఏఈ చందులాల్ తెలిపారు.మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో గురువారం 11 కేవీ విద్యుత్ వైర్లకు పంట రక్షణకు అక్రమ కనెక్షన్ వేసుకున్న వైర్లను గుర్తించి సిబ్బందితో వైర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రైతులు పండించిన మక్కజొన్న పంటలను అడవి పందుల బెడద నుండి కాపాడుకోవడానికి పంట చుట్టూ ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసి 11 కేవీ విద్యుత్ వైర్ల నుండి విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని, అడవి పందులు తాకగానే విద్యుత్ ప్రమాదంతో అవి మరణిస్తున్నాయని, వెంటనే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో విద్యుత్ క్రమబద్ధీకరణకు వచ్చే విద్యుత్ సిబ్బంది కూడా ప్రమాదాల బారిన పడే సంఘటనలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనలలో విద్యుత్ ప్రమాదాలు జరిగితే విద్యుత్ శాఖకు ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు. రైతులందరూ సహకరించి విద్యుత్ మెయిన్ వైర్ల నుండి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ కోరారు.

## జాతీయ రహదారిపై గుంతలు



**-ఇబ్బంది పడుతున్న వాహనదారులు..**

**వాజేడు డిసెంబర్ 26 మనవార్త**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని కృష్ణాపురం నుండి టేకులగూడెం గ్రామాల మధ్యలో 163 జాతీయ రహదారిపై భారీ గుంతలు పడడంతో ప్రమాదకరంగా మారింది.ఈ రహదారి నుండి భారీ వాహనాలు తెలంగాణ,ఛత్తిస్గాడ్ రాష్ట్రలకు రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ గుంతల్లో బిటి మిశ్రమం వేస్తే సమస్య పరిస్కారం అవుతుంది.ఈ గుంతలను జాతీయ రహదారి అధికారులు,ఇంజనీర్లు చూసి చూడనట్టు వదిలేస్తున్నారు.జాతీయ రహదారి అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలు వెంటనే పుడ్చాలని ప్రజలు కోరుకుంటూన్నారు.

## విద్య ఉపాధి వైద్యం వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం ఎమ్మెల్యే




**మహబూబ్ నగర్. డిసెంబర్ 26. మన వార్త ప్రతినిధి :**విద్య, ఉపాధి, వైద్యం, వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం ప్రజా ప్రభుత్వం ఇస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని మథర్సా ఇస్లామీయా కాషిఫ్ ఉల్ ఉలూమ్ సంస్థలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఉచితంగా దుప్పట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా నిబద్ధతతో విద్య అభివృద్ధికి పాటుపడుతున్న ఇటువంటి సంస్థలు చాలా ఉన్నాయని అటువంటి సంస్థలకు కావలసిన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు గతంలో ఈ సంస్థకు విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని మరియు వీరికి అవసరమైన కంప్యూటర్ కూడా అందించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పనిచేస్తుందని రాత్రి పండుకొని ఉదయం లేవంగానే నిర్ణయాలు తీసుకోదని అధికారులతోనూ మంత్రులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. అభివృద్ధి అనేది ఒక సంవత్సరంలో సాధ్యం కాదని ఒక్క సంవత్సరంలోనే 50 సంవత్సరాల పేదరికం దూరం కాదని అలా భావించడం కూడా కష్టతరమని ఆయన అన్నారు. రైతును బ్రతికించుకోవడం, నాణ్యమైన విద్య ను , వైద్యాన్ని ఉచితంగా అందించడం, నిరుద్యోగ యువతకు అండగా నిలిచి ఉపాధి అందించడం ఇవి మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలు అని అందుకే బడ్జెట్ లో సైతం ఎక్కువ నిధులు వీటికి కేటాయించి బడ్జెట్ లో కేటాయించిన ప్రతి పైసా నిజమైన లబ్ధిదారుడికి చేరాలన్నదే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్మమని ఆయన స్పష్టం చేశారు మహబూబ్ నగర్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి మీ ఆలోచనలు మీ సలహాలు తీసుకొని మహబూబ్ నగర్ ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, నూరూల్ హాసన్, రఫీక్ పటేల్, సమద్,కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ , మోయిూస్, బషీర్ తదితరులు పాల్గొన్నారు

## అన్వర్ కుటుంబానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సహాయం



**డిసెంబర్ 26 మన వార్త ప్రతినిధి**

**-అన్వర్ మృతి తీరని లోటు ఎల్ హెచ్ పిఎస్ ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్..**

ఈరోజు కడ్తాల్ మండల కేంద్రంలో ఎండి అన్వర్ మృతి చెందడం జరిగింది. అన్వర్ మృతి పట్ల లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి కడ్తాల్ ప్రజలకు తీరని లోటు అని అన్నారు. అన్వర్ తో తనకున్న స్నేహ సంబంధాన్ని గుర్తు చేశారు. చిన్ననాటి నుండి తనతో రేషన్ డీలర్ నడిపేటప్పుడు తన సలహాలు సూచనలు తీసుకొని నడిపించే వాడినని ఆయన గుర్తు చేశారు. అన్వర్ లాంటి మిత్రుడి మృతినిజీర్ణించుకోలేకపోతున్నానని తెలిపారు. అన్వర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. అనంతరం అన్వర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సేవ్య నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ పాండు మాజీ ఉపసర్పంచ్ శారదా పాండు నాయకులు మంగళపల్లి నరసింహ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ పునః నిర్మాణానికి విలేకరి ఆర్థిక సహాయం....



**వేములవాడ డిసెంబర్ 26 (మన వార్త ప్రతినిధి దెబ్బట్టి ప్రవీణ్ )**

కొడిమ్యాల మండల కేంద్రం లోని ఊళ్లే పోచమ్మ ఆలయ పునః నిర్మాణానికి వేములవాడ పట్టణానికి చెందిన విలేకరి రేగురి లక్ష్మణ్, కళ్యాణి దంపతులు 10 వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, కళ్యాణి దంపతులు మాట్లాడుతూ, కొడిమ్యాల మండలంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయకంగా 10 వేల రూపాయలు చందుర్తి మండలానికి చెందిన విలేకరి వంకాయల కార్తీక్ చేతుల మీదుగా విరాళం అందజేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కులమత బేధాలు లేకుండా అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండే సాంప్రదాయం ఉంటుందన్నారు. ఎల్లప్పుడు ఇలాగే కొనసాగాలని ఎలాంటి విభేదాలు లేకుండా సామరస్యంగా అందరి పండుగలను సాంప్రదాయాలను గౌరవించుకోవాలన్నారు. గ్రామంలో అందరి సహకారంతో పోచమ్మ గుడి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకొని ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మాంసాహార పంపిణీపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు



**-అర్చకులచే రాజన్న ఆలయ సంప్రోక్షణ..**

**-ఈ ఇ ఓ శ్రవణ్ కుమార్...**

**వేములవాడ డిసెంబర్ 26, (మన వార్త ప్రతినిధి దెబ్బట్టి ప్రవీణ్ )**

శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో మాంసాహారం పంపిణీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగిందని ఏఈవో శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మాంసాహార పంపిణీ విషయం తమ దృష్టికి రావడంతో వెంటనే ఆలయ సెక్యూరిటీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బందితో దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ, పలువురి పుట్టినరోజులను పురస్కరించుకునిబయటి వ్యక్తులు ఇతర ప్రదేశాలలో పంపిణీ చేసిన ఆహార పదార్థాలను యాచకులు, పేదలు ఆలయ పరిసరాల్లోకి తీసుకువచ్చినట్లు గుర్తించడం జరిగిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయాన్ని శుద్ధి చేయించి, అర్చకులచే సంప్రోక్షణ చేయించినట్లు వెల్లడించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ




**వేములవాడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు..**

**వేములవాడ పట్టణ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా..**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.....**

**వేములవాడ డిసెంబర్ 26 ( మన వార్తా ప్రతినిధి జయారపు శ్రీధర్)**

గురువారం రోజున వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసి రాజన్న దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తుల, వాహనాలు వేములవాడకి వస్తుంటాయని,వాటిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా పకడ్బందీగా ట్రాఫిక్ క్రమబద్ధీకారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.స్టేషన్ పరిధిలోని నాంపల్లి, నందికమాన్, తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్ వంటి కొన్ని ముఖ్య ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యల పై నా దృష్టికి రావడం జరిగిందని ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు,పట్టణ పరిధిలో పలు జంక్షన్ లలో ఉన్న రోడ్డు సంబంధిత ఇబ్బందులను ఇప్పటికే జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని,ఆయా ప్రాంతాల్లో అందరితో కలిసి ముందుకు వెళ్లి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయడం జరుగుతుదని,ప్రస్తుతం ఆర్. ఎస్.ఐ రాజు ఆధ్వర్యంలో కొత్తగా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.స్టేషన్ పరిధిలో పకడ్బందీగా విసిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేస్తూ వేములవాడ పట్టణ పరిధిలో స్పెషల్ టీం ఏర్పాటు చేయడంతో పాటు 5మందితో యాక్షన్ టీం ఏర్పాటు చేయడం జరిగింది.ఇందులో భాగంగా పట్టణ పరిధిలో 12 లోకేషన్లు గుర్తించి ప్రతి గంటకు ఒకసారి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తూ నిరంతరం భద్రత చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు.పట్టణ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ,రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు.ఎస్పీ వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఎస్ ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ఘన సన్మానం



**వేములవాడ డిసెంబర్ 26 ( మన వార్త ప్రతినిధి దెబ్బట్టి ప్రవీణ్ )**ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు మేలు చేసే విధంగా మార్కెట్ కమిటీ కార్యకలాపాలు ఉండాలని రైతుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తోపాటు డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మా దళిత రైతన్నల భూముల దగ్గరికి వస్తే ఆత్మహత్యలు చేసుకుని చనిపోతాం



**-డిసెంబర్ 26 మన వార్త ప్రతినిధి...**

**-అధికారుల ఎదుటనే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పూనుకున్న రైతు చింతసత్తి**

తాడూరు మండల కేంద్రంలో63కె రహదారి సర్వే చేయడానికి వచ్చిన అధికారులు తాడూరు మండల ఆర్.ఐ. సల్మాన్ మండల సర్వే అధికారి శ్రీధర్ రెడ్డి కి రిప్రెటేషన్ ఇవ్వడం జరిగింది. తాడూరు ఊర్లోనే బైపాస్ చేయడానికి అన్ని సదుపాయాలు ఉన్న కుట్రపూరితంగా ధనవంతుల భూములు వదిలేసి కటిక నిరుపేద లైన దళితుల భూములపై తాడూరు 167 కే బైపాస్ ఎన్నుకొని మమ్మల్ని నానా తిప్పలు పెడుతున్నారని జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న తాడూరు మండలం భూముల ధరలు కోటి నుంచి కోటి 20 లక్షల దాకా భూమి తమకున్న ఎకరా రెండు ఎకరాల భూములు వ్యవసాయం చేసుకోవడానికి అనుగుణంగా ఉన్నాయని భూమి దున్నుకొని జీవనం సాగిస్తున్నామని భూమితోనే బతుకుతున్నామని తమ కుటుంబాలు భూమి పోతే రోడ్డున పడతాయని కాబట్టి భూములు ఇవ్వమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏనుపోతుల కాశన్న. చింతసత్తి. చింత కురుమూర్తి. మంచాల శేఖర్. ఏనుపోతుల ఆంజనేయులు. దళిత రైతన్నలు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**- బోడుప్పల్, డిసెంబర్ 26, మన వార్త**

విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల దృష్ట్యా 27వ తారీఖు శుక్రవారం రోజున పలు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి పత్రికా ప్రకటనలో తెలిపారు. బోడుప్పల్ ఫీడర్ లోని బాలాజీ హిల్స్, వెస్ట్ బాలాజీ హిల్స్, ఈస్ట్ బాలాజీ హిల్స్, పద్మావతి కాలనీ, నార్త్ బాలాజీ హిల్స్, రాజశేఖర్ కాలనీ, సూర్య హిల్స్, నవోదయ కాలనీ, హేమ నగర్, న్యూ హేమా నగర్, కుమ్మరి కుంట, న్యూ రాంనగర్, మ్యాక్ డోవెల్ కాలనీ, తిరుమల మెడోస్, రెడ్డి కాలనీ, గాయత్రి హిల్స్, సప్తగిరి కాలనీ, మల్లయ్య నగర్, వాసవి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించవలసిందిగా విద్యుత్ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కి పరామర్శ..



**జమ్మికుంట, డిసెంబర్ 26( మన వార్త ప్రతినిధి):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తండ్రి పాడి సాయినాథ్ రెడ్డి ఇటీవల గుండెపోటుకు గురై గచ్చిబౌలి ఏ ఐ జీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మరియు మాజి మంత్రి శ్రీనివాస్ గౌడ్ లు పరామర్శించారు. సాయినాథ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి కౌశిక్ రెడ్డి ని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

## ఎల్ఎండి ద్వారా సాగునీరు విడుదల చేయాలి..



**-సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి...**

**జమ్మికుంట, డిసెంబర్ 26( మన వార్త ప్రతినిధి):**

రబీ సీజన్ కు గాను ఎల్ఎండి ద్వారా సాగునీరు వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రోజున జమ్మికుంటలో విలేకరుల సమావేశంలో వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ యాసంగి సీజన్ కు గాను వరి రైతులు నాట్ల కోసం ఆత్రుతగా లోయర్ మానేరు డ్యాం ద్వారా నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.. నారుమల్లు ముదిరిపోతున్నాయని తద్వారా దిగుబడి తగ్గే అవకాశాలు కూడా ఉంటాయన్నారు. ఎల్ఎండిలో 23 టీఎంసీలకు పైగా నిల్వ నీరు ఉన్నప్పటికీ సాగునీటికి విడుదల చేయకపోవడం ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం గా కనిపిస్తుందన్నారు. రెండు రోజుల్లో నీరు విడుదల చేయకుంటే కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎగువ ఆయకట్టుకు ఎస్సారెస్పీ ద్వారా నీరు విడుదల చేస్తున్నప్పటికీ దిగువ మానేరు రైతాంగానికి తీవ్ర నిరాశ ఎదురయింది అన్నారు. ఎగువ ప్రాంత రైతులకు నీరు విడుదల చేసి దిగువ ఆయకట్టుకు నీరు విడుదల చేయకపోవడం కరీంనగర్ జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమేనన్నారు. వెంటనే సాగునీరు విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా పగడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా పాలన పేరుతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుల తడకగా తయారైందని, అర్హులైన లబ్ధిదారులను గుర్తించకుండా ప్రజా ప్రతినిధుల జోక్యంతో లబ్ధిదారులను గుర్తించారన్నారు. సాంకేతికత లోపంతో ఒక మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారు పేరు మరో మున్సిపాలిటీ పరిధిలో రావడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించి అర్హులైన పేదలను గుర్తించి ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుందని, రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకిక విలువలకు ఇది పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదించిన సవరణలను వెంటనే తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్రీ బస్సుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అదనపు బస్సులు నడపాలన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు 2500 రూపాయలు, రైతు రుణమాఫీ వంటి హామీలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే పార్టీ రాష్ట్ర నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్, ఇల్లందకుంట మండల కార్యదర్శి చెలుపూరి రాములు, మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న దయతో ఆది శ్రీనివాస్కు మంత్రి పదవి రావాలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాశెట్టి రవీందర్



**వేములవాడ డిసెంబర్ 26 ( మన వార్త ప్రతినిధి దెబ్బట్టి ప్రవీణ్ )**

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి వన్నె తెచ్చిన ఘనత ఆది శ్రీనివాస్ కే దక్కింది రాబోయే రోజుల్లో ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ సస్యశ్యామలం కానుంది వేములవాడ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం పార్టీ కోసం కష్టపడ్డ బాశెట్టి రవీందర్ కు నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించాలి: పట్టణ పుర ప్రముఖులువేములవాడ రాజన్న దయతో స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనన్నకు మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు భాశెట్టి రవీందర్ అభిలాషించారు. కాంగ్రెస్ పార్టీకి వన్నె తెచ్చిన ఘనత స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కే దక్కిందని అయన కొనియాడారు. పట్టణంలోని ఆయన నివాసంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గానికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని వ్యాఖ్యానించారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు స్థానిక రైతంగా అభివృద్ధికి ఆది శ్రీనివాస నాయకత్వంలో ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పుర ప్రముఖులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇన్నాళ్లు కష్టపడ్డ బాశెట్టి రవీందర్ కు నామినేటెడ్ పదవి ఇచ్చి గౌరవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పట్టణ పుర ప్రముఖులు నామాల లక్ష్మి రాజ్యం, కట్కూరి శ్రీనివాస్, పులి రాంబాబు గౌడ్, పాత సత్యలక్ష్మి, మహమ్మద్ అక్రమ్, భాశెట్టి శ్రీనివాస్, బాసెట్టి రాజేందర్, కొత్త అనిల్, అన్నారపు శ్రీనివాస్, ఎస్.కె తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు..

## మాంసాహార ప్యాకెట్లు పంచిన వారిపై చర్యలు తీసుకోండి ఈవో వినోద్ రెడ్డి



**-రాజన్న ఆలయ సన్నిధిలో సంప్రోక్షణ కార్యక్రమం..**

**-బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..**

**-ప్రకటన విడుదల చేసిన ఆలయ ఈవో వినోద్ రెడ్డి....**

**వేములవాడ డిసెంబర్ 26 ( మన వార్తా ప్రతినిధి దెబ్బట్టి ప్రవీణ్ )**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో నిన్న సాయంత్రం కొంతమంది వ్యక్తులు మాంసాహారంతో కూడిన భోజన ప్యాకెట్లను అందివ్వడం వల్ల ఆలయ కార్య నిర్వహణ అధికారి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో దీనిపై బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా హిందూ మతానికి చెందిన భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లడం పట్ల రాజన్న ఆలయ సన్నిది తో పాటు గుడి చెరువు పరిసరాలు, ఆలయ పశ్చిమ వైపున ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పుణ్య వచన, సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రకటన విడుదల చేశారు.

## రెపరెపలాడిన పేదల పార్టీ జెండా ఎర్ర జెండా. భారత గడ్డపై ఎర్ర జెండాకు వందేళ్లు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 26 (మన వార్తా ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ కూకల కుంట సత్యనారాయణ కామ్రేడ్. యార్లగడ్డ ఈశ్వరరావు ముందుగా అమరజీవి కామ్రేడ్. యార్లగడ్డ భాస్కరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు అనంతరం యార్లగడ్డ ఈశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ స్థాపించి నేటికి 100 సంవత్సరాలు అయితుంది. 100 సంవత్సరాల వ్యవధిలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించింది. కమ్యూనిస్ట్ పార్టీ అఫ్ ఇండియా (సిపిఐ) పార్టీ 1925 చివరలో కాన్పూర్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్థాపించబడింది. నాటి స్వతంత్ర ఉద్యమం కానుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు బ్రిటిష్ వాడితో దేశానికి స్వతంత్రం కోసం పోరాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ నాటి నైజాంలకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ విముక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం వీరోచితంగా పోరాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ కమ్యూనిస్టు నాయకులు కార్యకర్తలు. ఎన్ని శిరస్సులు నేలరాలిన కమ్యూనిజం ఉదయించెనో కమ్యూనిస్టు పార్టీకి కార్యకర్తలే కంచుకోటలు నాయకులే ప్రజాదర. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బత్తుల సాయి దొంగ లక్ష్మీనారాయణ రాపోలు శ్రీమన్నారాయణ నల్ల ప్రసాద్ కోరం ప్రసాద్ కొరసా వెంకటేష్ జాన్ బి నక్క నాగమణి గాజుబోయిన కృష్ణవేణి ఈశ్వరి సత్యవతి రాధిక వీరస్వామి వెంకటేష్ శ్రీను విక్టర్ సిపిఐ (అనుబంధ) ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

**జమ్మికుంట, డిసెంబర్ 26( మన వార్త ప్రతినిధి):**

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు. సిఐ వివరాల ప్రకారం గురువారం పోలీస్ లు పెట్రోలింగ్ చేస్తుండగా హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద అనుమానాస్పదంగా ఒక ట్రాక్టర్ కనిపించగా తనిఖీ చేశారు. ట్రాక్టర్ లో తరలిస్తున్న ఇసుకకు సరైనా అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్ ను పోలిస్ స్టేషన్ కు తరలించి. విలాసాగర్ గ్రామానికీ చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సిరిశెట్టి రాజేష్ పై నమోదు చేసినట్లు తెలిపారు.

## నకిలీ సదరం సర్టిఫికెట్ల కుంభకోణంపై అధికారుల దృష్టి...!




**మన వార్త** కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో నకిలీ సదరం సర్టిఫికెట్ల కుంభకోణంపై అధికారులు దృష్టి సారించారు. పింఛన్లు, పన్ను మినహాయింపులు, ఇతర సౌకర్యాలు పొందేందుకు కొందరు అనర్హులు అక్రమంగా వైకల్య సర్టిఫికెట్లు పై అధికారులు కొద్దిరోజులు హడావిడి చేసి.. ఆ తర్వాత మిన్నకుండిపోయారు. ఏసీబీ విచారణ జరిపినా దోషులను తేల్చలేకపోయింది. తాజాగా విజిలెన్స్ విభాగం నాటి ఏసీబీ నివేదిక దుమ్ము దులిపింది. లోతుగా దర్యాప్తు.. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో నకిలీ సదరం సర్టిఫికెట్ల దందా కొన్ని సందర్భాల్లో బహిర్గతం కావడం, దీనిపై డీఆర్డీఏ, సంబంధిత జిల్లాల సివిల్ ఆసుపత్రి వర్గాలు పరస్పరం నిందించుకుని తాత్కాలిక ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. ఈ అంశంపై నిర్వహించిన ఏసీబీ విచా రణ కూడా డీఆర్డీఏ, సివిల్ ఆసుపత్రి కనుసన్నల్లోనే జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు లో ఇంతవరకూ దోషులను తేల్చకపోవటం అయోమయానికి గురిచేస్తుంది . తాజాగా ఈ కుంభకోణంపై దృష్టిపెట్టిన విజిలెన్స్ అధికారులు విష యాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగి అనుమానాస్పద సర్టిఫికెట్లు అన్నీ 2011 నుంచి 2021 మధ్య జారీ చేసినట్లు తేల్చారు. ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులను ప్రశ్నించినా పెద్దగా సమాచారం రాబట్టలేకపోయారు. ఈ కుంభకోణంపై ఏసీబీ డీజీ శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా దృష్టిపెట్టి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. ఇది పైకి కనిపిస్తున్నంత చిన్న కుంభకోణం కాదని అధికారులు అంటున్నారు. ఈ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగాలు, పన్ను రాయితీలు, పింఛన్లు, ఇంజినీరింగ్, మెడికల్ సీట్లు పొందుతున్న విషయాన్ని విజిలెన్స్ గుర్తించింది. ఈ కుంభకోణంలో నిందితులను ఎవరినీ ఉపేక్షించేది లేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. నెలకు రూ.3000 పింఛనే కదా వాటివల్ల ఏం నష్టం అని ఈ కుంభకోణం గురించి చాలామంది అనుకుంటున్నారు. కానీ, ఇది చాలా లోతైన కుంభకోణం. నెలకు రూ.3000 చొప్పున పింఛన్ చెల్లిస్తే లక్షల పైనే అవుతుంది. ఏడాదికి దాదాపు కోట్లలో అవుతుంది. అలాగే బస్ పాసులు, బ్యాంకు రుణాలు, లైసెన్సులు, రిజర్వేషన్లు, ఐటీ పన్ను మినహాయింపు.. ఇలా నెలనెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు కోట్లలో చిల్లు పడుతోంది. వీరి ఆట కట్టడంలో అధికారులు ఎంతవరకు సఫలం అవుతారో చూడాలి మరి.